## కేజీబీవీ తనిఖీ

ధర్పల్లి, జూలై 3 : మండల కేంద్రంలోని కేజీబీవీని జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఎలా ఉంది, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అపరిశుభ్రత నెలకొనకుండా చూసుకోవాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగదిని పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంతోషిని, ఉపాధ్యాయులు ఉన్నారు.

## టీయూ విద్యార్థికి అభినందన

టీయూ విద్యార్థి సాయికుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, జూలై 3 : టీయూలో ఎంఏ ఎకనామిక్స్ పైనలియర్ విద్యార్థి ధర్మపురి సాయికుమార్ ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ జాబ్ సాధించడంపై అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పున్నయ్య బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మపురి సాయికుమార్ పేద కుటుంబంలో పుట్టి డిగ్రీ వరకు గురుకుల కళాశాలలో చదివాడని, టీయూలో చదువుతూ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సాయికుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి/ ధర్పల్లి/ వేల్పూర్, జూలై 3 : ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవల పదో తరగతి పాసైన నల్లవెల్లి హరిణి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం కొండ గోవర్ధన్ తెలిపారు. ధర్పల్లి మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్ తెలిపారు. మెగావత్ పల్లవి, లోలం మేఘన, చాట్ల చందన, సబావాత్ అంకిత, పద్మ అక్షయ, లావుడ్య వసుంధర ఎంపికైనట్లు వివరించారు. వేల్పూర్ మండలం రామన్నపేట్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు ఇందూరు శ్వేత, గడ్డం శ్రీజ, గడ్డం రిషిక, కుంబాజి రచన ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వారిని హెడ్‌మాస్టర్ శివాజీ, టీచర్స్, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు అభినందించారు.

## గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి

ధర్పల్లి, జూలై 3 : గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసినందున ప్రజలకు అందుబాటులో ఉండి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంపీపీ సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులను ముమ్మరం చేసి కూలీలందరికీ పని కల్పించాలని, లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు.

# 'రైతుభరోసా'పై అభిప్రాయాల సేకరణ

రుద్రూర్ విండో మహాజన సభలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

కొత్తపల్లి సమావేశంలో రైతుల అభిప్రాయలను సేకరిస్తున్న అధికారులు

రుద్రూర్/ కోటగిరి/ పొతంగల్, బోధన్ రూరల్, జూలై 3 : రైతుల అభిప్రాయం మేరకే ప్రభుత్వ రైతు భరోసా పథకం అమలుపై సరికొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

జిల్లాలోని వివిధ సొసైటీల్లో బుధవారం మహాజన సభలు నిర్వహించి, రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కొత్తపల్లి సహకార సంఘం, కోటగిరి సహకార సంఘం ఆవరణలో చైర్మన్లు సునీల్‌కుమార్, కూచి సిద్ధు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోటగిరి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అభిప్రాయాలను సేకరించారు. పడావు, గుట్ట భూములను ఇవ్వకుండా, ఐదెకరాల వరకు పంట సాగు చేసే వారికి పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరికొందరు రైతులు పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని కోరగా.. మరికొందరు సాగు చేసేవారందరికీ అందజేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ గజేందర్, జాయింట్ రిజిస్ట్రార్ వసంత, లావణ్య, సీఈవోలు, ఏఈవోలు గౌస్, గంగాసాగర్ పాల్గొన్నారు.

రుద్రూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రాయకూర్‌లో ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు. రుద్రూర్‌లో నిర్వహించిన సభకు జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ హాజరై రైతుభరోసాపై అవగాహన కల్పించారు. ఐదెకరాలు ఉన్న వారికి పెట్టుబడి సాయం అందించాలని రైతులు అన్నారు. బీడు భూములు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వవద్దని రైతులు అభిప్రాయపడ్డారు. జడ్పీటీసీ నారోజి గంగారాం, రాయకూర్ విండో చైర్మన్ సంగమేశ్వర్, ఏవో నగేశ్‌రెడ్డి, రుద్రూర్ విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఏఈవో శ్రావణి, జిల్లా ప్రత్యేకాధికారి జియావుద్దీన్, కార్యదర్శులు సాయికిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పొతంగల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. ప్రత్యేకాధికారి జియావుద్దీన్ రైతుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. 10 ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందించాలని, ప్రతి సీజన్‌లో జూన్, డిసెంబర్‌లో సాయం అందేలా చూడాలని కోరారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ శాంతేశ్వర్ పటేల్, సీఈవో భరత్, ఏవో శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు, పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

సాలూరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. చాలా మంది రైతులు ఎకరానికి బోనస్ రూ. 500తోపాటు భూమిని సాగు చేసే వారికే సాయం అందించాలని అన్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని బోధన్ వ్యవసాయ అధికారి సంతోష్ నాయక్ తెలిపారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి, జూలై 3 : మండలకేంద్రంలోని మాధవ్‌నగర్ రైల్వేగేట్ వద్ద రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ (28) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

## అథ్లెటిక్ పోటీల్లో విజయ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఖలీల్‌వాడి, జూలై 3 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు రాజారాం స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. అండర్-10 విభాగంలో లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగుపందెంలో 5వ తరగతి చదువుతున్న విశ్వతేజ్‌కు 2 బంగారు పతకాలు, అండర్-12 లో 6వ తరగతి చదువుతున్న ప్రద్యుమ్నకు కాంస్య పతకం, 300 మీటర్ల విభాగంలో 5వ తరగతి చదువుతున్న హార్థికకు కాంస్య పతకం, 100 మీటర్ల విభాగంలో 4వతరగతి చదువుతున్న వరుణ్‌కు కాంస్య పతకం సాధించారని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. విద్యార్థులతోపాటు పీఈటీసీలు స్రవంతి, పద్మలతను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత బుధవారం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం సిబ్బంది

## మోస్రాలో మండల సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి

చందూర్, జూలై 3 : మండలకేంద్రంలో ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. జడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు మాట్లాడుతూ.. నాయకులు వస్తారు, పోతారని, అధికారులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని అన్నారు. ఐదేండ్ల పాటు వారు చేసిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కత్తి శంకర్, మమత, ఎంపీడీవో ప్రవీణ్, తహసీల్దార్ మారుతి, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు చైతన్య సదస్సులు

అవగాహన కల్పిస్తున్న గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్

ఖలీల్‌వాడి, జూలై 5 : నగరంలోని కిషన్ గంజ్‌లో ఉన్న రామకృష్ణ మఠంలో అంగన్‌వాడీ టీచర్లకు 'ఆహార కల్తీ'పై ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం చైతన్య సదస్సు నిర్వహించారు. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్ వంట సామగ్రి ఆహార కల్తీని గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సంక్షేమాధికారిణి రసూల్‌బీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వమే బియ్యం, టెట్రాపాలు, ఇతర సామగ్రిని సరఫరా చేస్తున్నదని, స్థానికంగా ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వ కేటాయించిన మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఆహార కల్తీ పరీక్షలు నిర్వహించారు. సదస్సుకు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అధ్యక్షత వహించారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, ప్రవీణ్, ఆహార పదార్థాలను టెస్ట్‌చెక్ నిర్వహించారు.

## ఆపరేషన్ ముస్కాన్‌పై అవగాహన

వినాయక్‌నగర్, జూలై 3 : నగరంలోని రైల్వేస్టేషన్‌లోని ప్రయాణికులకు నిజామాబాద్ రైల్వేపోలీస్, చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై బుధవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి మాట్లాడుతూ.. 18 ఏండ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని తెలిపారు. పిల్లలతో భిక్షాటన చేయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చైతన్య, బచ్‌పన్ బచావో టీం సోని, పవన్, విశ్వనాథ్, జీఆర్పీ సిబ్బంది వరలక్ష్మి, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున పోలీసులు

## కరపత్రాల ఆవిష్కరణ

ఖలీల్‌వాడి, జూలై 3 : ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో దీక్షను చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నల్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి, మాట తప్పారని అన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## పీఆర్ డిప్యూటీ ఈఈగా ఇషాక్‌అలీ

డిచ్‌పల్లి, జూలై 3 : పంచాయతీరాజ్ నూతన డిప్యూటీ ఈఈగా మహ్మద్ ఇషాక్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి డిప్యూటీ ఈఈగా పనిచేసిన శంకర్‌నాయక్ ఈఈగా పదోన్నతిపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇషాక్ అలీ బాధ్యతలు చేపట్టారు.

## 'మలేరియా'పై అవగాహన

పొతంగల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

పొతంగల్/ ఇందల్వాయి, జూలై 3 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అన్నారు. పొతంగల్ జడ్పీహెచ్‌ఎస్ పరిసర ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. పాఠశాల వెనుక భాగం పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. కాలనీవాసులకు అపరిశుభ్ర వాతావరణం ద్వారా కలిగే అనర్థాలు, మలేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిలు, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఇందల్వాయి మండలం గన్నారంలో జాతీయ మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా మలేరియాపై ఆరోగ్య విస్తరణాధికారి శంకర్ అవగాహన కల్పించారు. ఈ మాసాన్ని డెంగీ మాసంగా ప్రకటించడంతో పరిసరాల శుభ్రత, దోమల పెరుగుదలను అరికట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్లీచింగ్ పౌడర్ కలిపిన తర్వాతే తాగునీటి సరఫరా చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శారద, ఇందిర, ఆనంద్, స్రవంతి, ఆశకార్యకర్త షకీనా పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

● **నర్సరీ పరిశీలన -** కోటగిరి, జూలై 3 : మండలంలోని లింగాపూర్‌లో వన నర్సరీని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. వారంలోగా హరితహారం (వన మహోత్సవం)లో భాగంగా మొక్కలు నాటాలని కార్యదర్శి రాజును అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 10 వేల మొక్కల టార్గెట్ ఉందని, 3700 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని కార్యదర్శి వివరించారు.

● **వాగులో వ్యర్థ పదార్థాలు వేయకుండా చూడాలి -** సిరికొండ, జూలై 3 : మైలారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సిరికొండ -భీమ్‌గల్ దారిలో దిండ్ల వాగులో వ్యర్థ పదార్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు సిరికొండ యువకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోని వ్యర్థాలను వాగులో పడవేయడంతో దుర్వాసన వస్తున్నదని, గ్రామస్తులు రోగాల బారిన పడే అవకాశముందని పేర్కొన్నారు.

● **ఆర్థిక సహాయం అందజేత -** ఖలీల్‌వాడి, జూలై 3 : జిల్లాకేంద్రంలోని గాజులపేట్ పెద్దరాంమందిర్ వద్ద ఉండే నిరుపేద యేముల దేవరాజ్ హైబీపీతో ఆరు రోజుల క్రితం మృతిచెందాడు. అతడి తల్లి వృద్ధురాలు కావడం, తమ్ముడికి కండ్లు కనిపించకపోవడంతో శ్రీలక్ష్మీ చేయూత సేవా సభ్యులు చందాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. దాతలు సహకారంతో పోగైన డబ్బులు రూ.16, 022, కిరాణా సామగ్రి బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్యామ్, చంద్రశేఖర్, ఓంరాజ్ పాల్గొన్నారు.

● **జీలుగ సాగుతో భూసారం వృద్ధి :** బాల్కొండ, జూలై 3: మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో రైతులకు పచ్చరొట్టపైరు జీలుగపై అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. పచ్చిరొట్ట పైరైన జీలుగ, జనుము విత్తనాలను ప్రభుత్వం రాయితీపై రైతులకు అందజేస్తున్నదని పేర్కొన్నారు. వరి వేసే మాగాణిలో మే చివరిలో విత్తనాలు చల్లుకుని పచ్చరొట్ట పైరును సాగు చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఏఈవో నిహారిక, రైతులు పాల్గొన్నారు.

● **'నీట్'ను రద్దు చేయాలి:** ఆర్మూర్‌టౌన్, జూలై 3: నీట్‌ను వెంటనే రద్దు చేయాలని, నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు పట్టణం లో మీడియాతో మాట్లాడారు. గురువారం నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల బంద్‌లో నీట్ విద్యార్థులందరూ పాల్గొని మద్దతు తెలుపాలని కోరారు.

● **బదిలీపై వచ్చిన టీచర్లకు సన్మానం:** వేల్పూర్, జూలై 3 : మండలంలోని పడిగెల్ ఉన్నత పాఠశాలకు బదిలీ, ప్రమోషన్లపై వచ్చిన ఉపాధ్యాయులు దాస్, సుమలత, రాంచందర్, రాజేశ్వర్, గోదావరిని గ్రామానికి చెందిన యువకులు, పూర్వ విద్యార్థులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచందర్, పూర్వ విద్యార్థులు బ్రిజేష్, చరణ్, శేఖర్, శంకర్, రాజేశ్, వినోద్ పాల్గొన్నారు.

● **ఆలయానికి ఎంపీపీ విరాళం:** ముప్కాల్, జూలై 3: మండల కేంద్రంలో చేపట్టిన శుక్రవారం గుడి నిర్మాణానికి ఎంపీపీ సామ పద్మా వెంకట్‌రెడ్డి రూ.25,011 విరాళం ప్రకటించారు. ఈ మేరకు అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం చెక్కును అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బద్దం నర్సవ్వ,ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన :** నందిపేట్, జూలై 3: మండలంలోని అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసులు సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ల ద్వారా మాయమాటలు చెప్పి డబ్బులు సులువుగా కాజేస్తున్నారన్న అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నందిపేట్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **8న లింబాద్రిగుట్టపై భక్తులకు దర్శనం నిలిపివేత :** భీమ్‌గల్, జూలై 3 : నింబాచల క్షేత్రంపై సాధారణ భక్తులకు స్వామి దర్శనం ఈ నెల 8న నిలిపివేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నంబి లింబాద్రి కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీ నింబాద్రి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయ గురువులు సత్యాత్మ తీర్థ శ్రీ పాదులవారు ఈనెల 8న లింబాద్రి గుట్టకు రానున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనాలు ఉండవని తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

● **యోగా పోటీల విజేతలకు బహుమతులు:** భీమ్‌గల్, జూలై 3 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆన్‌లైన్ క్విజ్, యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో పది మంది విజేతలుగా నిలువగా భీమ్‌గల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు జి.యశ్విత మూడో స్థానం, ఎన్.వాణి నాల్గో స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయుడు స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విల్సన్, లింబాద్రి, రఘువాస్, రాజ్‌కుమార్, వినోద్, వాసుదేవ్, సాగర్, శివకుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

● **జ్యోతిబాపూలేకు ఘన నివాళి:** మోర్తాడ్, జూలై 3: దేశ చరిత్రంలో మొదటి సారి బాలికల పాఠశాలను మహాత్మా జ్యోతిబాపూలే జూలై3న ఏర్పాటు చేశారని దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరిరాజారాం తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాంభవ, గంగాధర్, అంగులీ మాల తదితరులు పాల్గొన్నారు.

● **అమ్మ ఆదర్శ పనులను సత్వరమే ప్రారంభించాలి:** రెంజల్, జూలై 3 : అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ డీఈ రాజయ్య కాంట్రాక్టర్లకు సూచించారు. అంతకు ముందు అంబేద్కర్‌నగర్ గ్రామంలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు.

● **జ్యూట్ బ్యాగుల అందజేత:** ఆర్మూర్‌టౌన్, జూలై 3: పట్టణంలోని రైతుబజార్‌లో వ్యాపారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. నేషనల్ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించి, జ్యూట్ బ్యాగులను అందజేసినట్లు ఆయన తెలిపారు. క్లబ్ సభ్యులు నారాయణ గౌడ్, అంబాల్ల తిరుపతి, రమేశ్, చిన్నా రవి కుమార్, శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు వేముల పరామర్శ

వేల్పూర్‌లో ఓ వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి వేముల

మోర్తాడ్/ ఏర్గట్ల/ వేల్పూర్, జూలై3: బాల్కొండ నియోజకవర్గంలో ఏర్గట్ల, వేల్పూర్, బాల్కొండ మండలాల్లో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలకు ఆర్థికసాయం చేశారు. తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన బోదాస్ గంగాధర్ కుటుంబానికి రూ.10వేలు, ఏర్గట్ల గ్రామానికి చెందిన కనగుర్తి గంగాధర్ కుటుంబానికి రూ.10వేలు, ఇటీవల ఆక్సిడెంట్‌లో మృతి చెందిన బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువకుడు నాగేంద్రయాదవ్ కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఏర్గట్ల, మెండోరా, బాల్కొండ, వేల్పూర్ మండలాల్లోని పలు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించారు.

## నేడు జడ్పీటీసీ, ఎంపీపీలకు సన్మానం

బాల్కొండ, జూలై 3: ఐదేండ్లు ప్రజాజీవితంలో ఉంటూ ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలు అందించిన బాల్కొండ నియోజకవర్గ ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపీటీసీలు పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో వారిని సన్మానించనున్నారు. నియోజకవర్గ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీపీలు అందరూ కార్యక్రమానికి హాజరు కావాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

మాక్లూర్, జూలై 3: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలో డెంగీ వ్యాధితో బాధపడుతున్న వారిని పరామర్శించి జాగ్రత్తలు సూచించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శికి సూచనలు చేశారు. జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి అక్కడ హెడ్మాస్టర్, స్టాఫ్ తో సమావేశం ఏర్పాటుసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలను తొలగించాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య శిబిరంలో 73 మందికి చికిత్స, 22 మందికి రక్త పరీక్షలు చేసినట్లు డాక్టర్ ప్రకాశ్‌కుమార్ తెలిపారు. డీఎంహెచ్‌వో వెంట సీహెచ్‌వో ఆనంద్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, నారాయణ, సుజాత, సుధాకర్, సరిత, స్నేహ, శ్రీలేఖ, సూర్యకాంత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండ్ల పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి తుకారాం రాథోడ్

మండల కేంద్రంలోని ఈద్గాకు జడ్పీ నుంచి రూ. 5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. నందిపేట్‌లోని ఈద్గా వద్ద ఆయన ఉపాధికూలీలతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం జడ్పీ చైర్మన్‌ను మండలకార్యాలయంలో మాజీ సర్పంచులు, నాయకులు సన్మానించారు. -నందిపేట్, జూలై 3

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బాల్కొండ/ మోర్తాడ్, జూలై 3 : బాల్కొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 10 గ్రామాలకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం తహసీల్దార్ శ్రీధర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మోర్తాడ్ మండల పరిషత్ సమావేశపు గదిలో 49 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ శివలింగుశ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్నవారిలో ధర్మోరా, దొన్కల్, శెట్‌పల్లి, సుంకెట్, వడ్యాట్, దోన్‌పాల్, పాలెం, తిమ్మాపూర్, మోర్తాడ్‌కు చెందిన వారు ఉన్నారు.

## పిల్లలకు 12వ్యాక్సిన్లు అందేలా చూడాలి

మోర్తాడ్, జూలై 3: ప్రభుత్వ దవాఖానల్లో పిల్లలకు అవసరమయ్యే 12 రకాల వ్యాక్సిన